క్లుప్తంగా

ప్రత్యామ్నాయ లైన్లకు సీఎండీ అనుమతి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి సర్కిల్ పరిధిలో ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ ఏర్పాటుకు ఎన్పీడీసీఎల్ సీఎండీ అనుమతించినట్టు జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి సర్కిల్ పరిధిలో వివిధ సబ్‌స్టేషన్లకు ఇంటర్ లింక్ ప్రత్యామ్నాయ లైన్లు గుర్తించగా 9 లైన్ల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక చేస్తున్నట్టు ఎస్ఈ పేర్కొన్నారు.

పూర్తి ప్రహరీ లేక ఇబ్బందులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం 40 శాతం మాత్రమే ప్రహరీ ఉంది. మిగతా 60 శాతం లేకపోవడంతో పశువులు, కుక్కలు, విష జంతువులు పాఠశాలలోకి వస్తున్నాయి. దీంతో పాఠాలు చెప్పేటప్పుడు విద్యార్థులకు పాఠాలు అర్థం కావడం లేదు. అలాగే వంట గదికూడా లేకపోవడంతో పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. మరుగుదొడ్లు కూడా శిథిలావస్థకు చేరాయని, వాటిని తొలగించి నూతనంగా నిర్మించాలని కోరుతున్నారు.

'హెచ్‌ఎంలకు మధ్యాహ్న భోజన బాధ్యతలు వద్దు'

కామారెడ్డి అర్బన్: పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లను మధ్యాహ్న భోజనం బాధ్యతల నుంచి తప్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను సందర్శించినపుడు పలువురు హెడ్‌మాస్టర్లు మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి తమను తప్పిస్తే విద్యాబోధనపై దృష్టి సారించవచ్చని అన్నారని చెప్పారు. మధ్యాహ్న భోజన అమలుకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆకుల బాబు కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజవర్ధన్, జిల్లా బాధ్యులు నర్సింహారావు, నారాయణ, సాయిగౌతమ్, ఏసురత్నం, నాంపల్లి, బాలయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ఫరీదుపేటవాసి ప్రతిభ

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన సునీల్ రెడ్డి జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ 800 మీటర్ల రన్నింగ్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డిని శనివారం గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన మోడల్ స్కూల్ విద్యార్థినులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న ఆకుల సంజన ఎలక్యూషన్ పోటీల్లో మొదటి బహుమతి సాధించగా, ఆరె సంజన.. ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం



రాజంపేట: కొండాపూర్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో పూర్ణచందర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మన ఊరు– మన బడి పథకంలో భాగంగా పాఠశాలలో జరగవలసిన పనులు మధ్యలో ఆపేశారని, ఇంకా ప్రారంభించకపోవడం – మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల విద్యార్థులు చాలా రకాల ఇబ్బందులకు గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తామని అన్నారు.

చెక్కు అందజేత



బీబీపేట: యాడారం గ్రామానికి చెందిన గన్నమనేని సత్యవతి, వడ్ల సత్యంకు శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, మాజీ సర్పంచ్ వెంకటేశం పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

మార్కండేయ జయంతిని శనివారం పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయుడి చిత్రపటాలను ఏర్పాటు చేసి అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల కలశాలను ఊరేగించారు. జలాభిషేకాలు చేశారు. దీంతోపాటు మార్కండేయుడి విశిష్టత గురించి తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్



బస్వన్నపల్లిలో కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న పద్మశాలి మహిళలు



పిట్లంలో నిర్వహిస్తున్న శోభాయాత్ర



గాంధారిలో..



ఎల్లారెడ్డిలో..



జీవీపేట చెరువులో నుంచి నీళ్లు తీసుకొస్తున్న మహిళలు



సదాశివనగర్‌లో..



రామారెడ్డిలో మంగళహారతులతో మహిళలు



లింగంపేట పద్మశాలి సంఘంలో భక్తుల పూజలు



గోపాల్‌పేటలో..



కొమలంచలో అన్నప్రసాదం వితరణ



బిచ్కుంద శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



రామేశ్వర్‌పల్లిలో మార్కండేయ జయంతికి హాజరైన ఎమ్మెల్యే కేవీఆర్‌కు మెమెంటోను అందజేస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు



తాడ్వాయి మార్కండేయుడి ఆలయంలో యజ్ఞం



తాండూర్‌లో పూజలు చేస్తున్న పద్మశాలీలు

పేకాట అడ్డాగా అడవి



- చేతులు మారుతున్న రూ. లక్షలు
- పోలీసుల కంట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న పేకాటరాయుళ్లు

బాన్సువాడ: పోలీసుల కంటపడకుండా ఉండేందుకు పేకాట రాయుళ్లు తెలివిగా వ్యవహరిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పేరుతో ఎవరైనా వచ్చి పట్టుకుంటారేమోనని ఆందోళనతో వీరు ఎవరి కంటపడకుండా ఉండేందుకు రహస్య ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. బాన్సువాడ డివిజన్‌లోని బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్ అటవీ ప్రాంతాల్లో పేకాటరాయుళ్లు గ్రూపులుగా ఏర్పడి పేకాట కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతాల్లోని గ్రామస్తులకు సైతం అనుమానం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాంతాలకు కార్లలో కాకుండా బైక్‌లపై వస్తూ తమ ఆటను కొనసాగిస్తున్నారు. విందులు, వినోదాల పేరిట గ్రామస్తులు, పోలీసుల కంటపడకుండా రోడ్లపై కొంత మందిని ఏర్పాటు చేసుకుని మరీ అటవీ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. ఈ కేంద్రాల్లో రూ.10 వేల నుంచి రూ. లక్ష వరకు పేకాట ఆడుతుండడంతో నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. ఈ పేకాట కేంద్రాలకు చుట్టు పక్కల 10 గ్రామాల పేకాటరాయుళ్లు వస్తున్నట్లు సమాచారం.

మూడు మండలాల అటవీ ప్రాంతం..

బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్ శివారులో ఉండే అటవీ ప్రాంతాల పై పోలీసులు సరి గా దృష్టి సారించలేకపోతున్నా రు. బాన్సువా డ మండలంలోని ముదెల్లి అటవీ ప్రాంతంతో పాటు హన్మాజీపేట్, కొత్తాబాది, బుడ్మి గ్రామ శివారుల్లో పేకాట అడ్డాలు కొనసాగుతున్నాయి. బాన్సువాడ పట్టణంలో మూడు, నాలుగు పేకాట స్థావరాలు ఉన్నట్లు తెలిసింది. బాన్సువాడ–బోధన్ రోడ్డులోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతున్నవారిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. పేకాట రాయుళ్లను అరెస్ట్ చేస్తున్నప్పటికి వివరాలను బయటపెట్టకపోవడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. అలాగే బీర్కూర్ మండలంలోని మంజీర ప్రాంతాన్ని అడ్డాగా ఎంచుకున్నారు. నస్రూల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి, అంకోల్, సంగెం, కంపలగండి, మల్లాపూర్ ప్రాంతాలు పేకాటరాయుళ్లకు అడ్డాగా మారాయి. ఎవరైనా అటవీ ప్రాంతంలోకి రారని, ఒక వేళ వచ్చినా ముందస్తుగా తమకు సమాచారం తెలుస్తోందని పేకాట రాయుళ్లు బహిరంగంగానే పేర్కొంటున్నారు. అటవీ ప్రాంతంలో నిర్వహించే పేకాట స్థావరాల్లో పేకాటలో వచ్చిన డబ్బులతో వారు విందులు, వినోదాలు చేసుకుంటున్నారు. ఒకవేళ పోలీసులు వచ్చినా పారిపోవడానికి అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ అటవీ ప్రాంతాన్ని పేకాట రాయుళ్లు ఎంచుకుంటున్నారు.

మోడల్‌హౌస్ నిర్మాణానికి భూమిపూజ



నాగిరెడ్డిపేటలో భూమిపూజ చేస్తున్న అధికారులు



తాడ్వాయిలో మార్కింగ్ చేస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన మోడల్ హౌస్ నిర్మాణానికి అధికారులు భూమిపూజ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల ఈ–పంచాయతీ కార్యాలయం వెనకవైపు ఖాళీగా ఉన్న స్థలాన్ని మోడల్‌హౌస్ నిర్మాణానికి ఎంపికచేశారు. అనంతరం నిర్మాణం కోసం మార్కింగ్ చేశారు. హౌజింగ్ డీఈఈ సుభాష్, ఏఈ అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకరచారి, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు కిష్టయ్య, కార్తీక్, సంతోష్ పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మాణానికి అధికారులు మార్కింగ్ చేశారు. హౌసింగ్ డీఈ సుభాష్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇందిరమ ఇళ్లను ఎలా నిర్మించుకోవాలో తెలియజేయడానికి ఈ మోడల్ ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఏఈ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సభకు డప్పులతో తరలిరావాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

భిక్కనూరు: మాదిగ రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న లక్ష డప్పులు వెయ్యిగొంతుల సభకు డప్పులతో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మన్ మాదిగ, కార్యదర్శి శంకర్ మాదిగలు కోరారు. వారు శనివారం భిక్కనూరులో మాట్లాడుతూ.. మాదిగ రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో తీర్మానం చేయిస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మాట తప్పిన రాష్ట్ర ప్రభుత్వంపై లక్ష డప్పులు వెయ్యి గొంతులతో నిరసన తెలిపేందుకు ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం మాదిగ రిజర్వేషన్‌లకు అనుకూలంగా ఉన్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కర్రోళ్ల రాజు, నేతలు పైతరి స్వామి, కోక స్వామి, రామగల్ల భిక్షపతి, జీవన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెళ్లే దారి కబ్జా చేశారని ఫిర్యాదు



బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

బాన్సువాడ : పట్టణంలోని పాత అంగడిబజారు సమీపంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి వెళ్లే దారిని కొందరు కబ్జా చేశారని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీవాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 17వ వార్డులో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి వెళ్లే దారి గతంలో 18 ఫీట్లు ఉండేదని, కానీ కొందరు దారిని కబ్జా చేసుకోవడంతో ఆలయానికి వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ వాసులతో పాటు బీజేపీ నాయకులు శంకర్‌గౌడ్, శ్రీనివాస్, హన్మాండ్లు, కోనాల గంగారెడ్డి, వెంకటేష్, సాయి, ప్రసాద్, సిద్ధి పర్వయ్య, అనిల్, మొయిన్‌ఖాన్, శంకర్ తదితరులున్నారు.

ఫ్లెక్సీలను తొలగించడం సరికాదు



కామారెడ్డి టౌన్: ప్రముఖ సామాజిక సేవకుడు, ఎన్నారై బల్ల ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించడం సరికాదని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా, ఎన్నికల కోడ్ ఉల్లంఘన లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే ఎన్నికల కోడ్ పేరిట తొలగించడం దారుణమన్నారు. ఇదేటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తించారని వాపోయారు. పట్టణంలో కొత్త బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, ఇందిరాచౌక్‌లో రాజకీయ నేతల ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీలను ఎందుకు తొలగించలేదని ప్రశ్నిస్తే టీపీఎస్ పొంతనలేని సమాధానం ఇచ్చారని మండిపడ్డారు. శీలా సాగర్, వేణుగోపాల్, రవి, రాజేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రితో మేరు సంఘం నాయకుల భేటీ



మాచారెడ్డి: బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మండల మేరు కులస్తులు శనివారం కలిసి సంఘ భవనం కోసం స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ.. కుల సంఘ స్థలానికి నిధులు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండల అధ్యక్షుడు అందోల్ భిక్షపతి, ఉపాధ్యక్షుడు మాడిశెట్టి వెంకటేష్, నరేష్, స్వామి, వెన్ను సంజీవ్, ఉన్నారు.

సంతూర్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఎల్లారెడ్డి: ప్రతిష్ఠాత్మక సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ కింద ఎంపికైన విద్యార్థులకు ప్రతి నెలా రూ.2 వేల చొప్పున మూడేళ్లపాటు అందిస్తారని ఆయన చెప్పారు. కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న లక్ష్మి, మానస, అశృత, భార్గవి, కవిత, సౌజన్య, అంజలి, శ్వేత, శివాని, గంగోత్రి, వైష్ణవి, మీనాక్షి, ప్రత్యూష, సంధ్య ఎంపికై నట్లు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్, విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉంటుందని సంతూర్ స్కాలర్‌షిప్ ఇన్‌చార్జి, కళాశాల ఆంగ్ల అధ్యాపకులు సంతోష్ తెలిపారు.

ఆధ్యాత్మికం..

సరస్వతి దేవి ఆలయంలో పోచారం పూజలు



బాన్సువాడ : బాన్సువాడ సరస్వతి దేవి ఆలయంలో శనివారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వసంత పంచమి పురస్కరించుకుని సరస్వతి మాలధారణ దీక్ష స్వాములు 41 రోజుల పాటు దీక్ష చేపట్టారు. వసంత పంచమి రోజున బాసర పుణ్యక్షేత్రంలో దీక్ష విరమణ చేస్తారు. ఇరుముడితో బాసర పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్లారు. పాదయాత్రను పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ధర్మ కర్త పోచారం శంభూరెడ్డిలు ప్రారంభించారు. సరస్వతి దీక్ష స్వాములతో పాటు పట్టణవాసులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. 35 ఏళ్లుగా బాన్సువాడలో సరస్వతి మాలధారణ కొనసాగుతోందని ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ తెలిపారు.

పిట్లం నుంచి పాదయాత్ర



పిట్లం(జుక్కల్): మండల కేంద్రం నుంచి బాసర పుణ్యక్షేత్రానికి సుమారు మంది భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వసంత పంచమి సందర్భంగా అమ్మవారి దర్శనానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లామని చెప్పారు. ఈ పాదయాత్ర 3 రోజులు పాటు సాగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహం ఊరేగింపు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని మైసమ్మ ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి విగ్రహంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. 3వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. నేడు యజ్ఞం, గోమాత, విగ్రహ ప్రతిష్ఠాపన పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : బెజుగంచెరువుతండాలో రెండో రోజు జగదాంబమాత, సేవాలాల్ మహరాజ్ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబునాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, నాయకులు విక్రాంత్‌రెడ్డి, వరాజ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్తం

ఎస్సెస్సీ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్):మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్సెస్సీ విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రభుత్వ పరంగా స్నాక్స్ అందిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రాజ్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జరుప్లా, ఉపాధ్యాయుడు భోజన్న తదితరులున్నారు.

బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో..



బీబీపేట: రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో అందిస్తున్న స్నాక్స్‌ను శనివారం ఆయా పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్నాక్స్‌ను అందజేశారు. ప్రత్యేక తరగతుల సందర్భంగా విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలల్లోనే ఉండడం వల్ల ప్రభుత్వం స్నాక్స్‌ను అందజేస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి తెలిపారు.

కాశీలో భిక్కనూరు దంపతుల అన్నదానం

భిక్కనూరు: మహా కుంభమేళా సందర్భంగా కాశీలో భక్తులకు భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన శనిశెట్టి వెంకటేశం–సుభద్ర దంపతులు శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సొంత డబ్బులతో కుంభమేళ ప్రారంభమైన జనవరి 13 నుంచి అన్నదానం చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేస్తున్నామని, కుంభామేళ పూర్తయ్యే వరకు అన్నదానం చేస్తామని 'సాక్షి'తో వారు ఫోన్‌లో వివరించారు.



రాజంపేటలో అన్నదానం

రాజంపేట: రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ బల్ల ఆంజనేయులు(అనిల్) జన్మదినాన్ని పురస్కరించుకుని అంజన్న సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజంపేట గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలలో ఆపదలో తన వంతు ఆర్థికసహాయంతోపాటు సామాజిక సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. రవి, జింక భాస్కర్, ఆశయ్య, ప్రవీణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

